క్లుప్తంగా

రోడ్డు నిర్మాణంలో నాణ్యత కీలకం

సంగెం : రోడ్డు నిర్మాణంలో నాణ్యత కీలకమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆశాలపల్లి నుంచి ఆశాలపల్లి క్రాస్ వరకు సీఆర్‌ఆర్ గ్రాంట్ నుంచి మంజూరైన రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు జనగాం రమేశ్, కిశోర్, అంజన్‌రావు, తదితరులున్నారు.

సన్మానం



నర్సంపేట రూరల్ : విధుల్లో చేరిన స్థానిక ఎస్సై రవికుమార్‌ను బీజేపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు నాయకులతో కలిసి శాలువాతో గురువారం సన్మానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి రాజేందర్, గూడూరు సందీప్, ఉపాధ్యక్షులు ఠాకూర్ శివరంజన్ సింగ్, వల్లజి నరేందర్, ఠాకూర్ విజయ్ సింగ్, వరంగంటి రాజ్‌కుమార్, సోషల్ మీడియా పట్టణ ఇన్‌చార్జీ సామల ప్రవీణ్‌కుమార్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు తొటం నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా చందర్ బాధ్యతల స్వీకరణ



వర్ధన్నపేట : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా చందర్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై ప్రవీణ్‌కుమార్ హనుమకొండ జిల్లాలోని కేయూ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా వరంగల్ స్పెషల్ బ్రాంచ్‌లో పని చేసిన చందర్ ఇక్కడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై విలేకరులతో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు.

బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శిగా రాజు



దుగ్గొండి : మండలంలోని చంద్రయ్యపల్లికి చెందిన ఈర్ల రాజు బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రాజుకు ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డ్యాగల శ్రీనివాస్ గురువారం నియామక పత్రం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. బీసీ యువకులకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం కృషి చేస్తానని చెప్పారు.

అంబేడ్కర్ సంఘం ఇన్‌చార్జ్‌గా రవి



నర్సంపేట : మండలంలోని ముగ్దుంపురం గ్రామానికి చెందిన జన్ను రవి తెలంగాణ అంబేడ్కర్ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రవికి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు కంజర్ల మహేశ్ గురువారం నియామక పత్రం అందజేశాడు. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. బడుగుల హక్కుల కోసం పోరాడతానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, శ్రీను, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగ అరెస్టు

గీసుకొండ : బైక్ దొంగను ఎస్సై కుమార్ అరెస్టు చేయగా రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బాబూలాల్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. వరంగల్ నగరంలోని పడమటి కోటకు చెందిన మైదా మహేశ్ ఈనెల 1న రైల్వేస్టేషన్ టూల్ రూం ఎదుట బైక్‌ను పార్క్ చేసి విధులకు వెళ్లి వచ్చే సరికి బైక్ చోరీకి గురైంది. ఈ విషయమై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం సాయంత్రం ఊకల్ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా తమిళనాడుకు చెందిన పెరుమల్ గోపీనాథ్ అనుమానాస్పదంగా బైక్‌పై వెళ్తుండగా అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా చోరీకి పాల్పడ్డట్టు వెల్లడించారు. గోపీనాథ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

నేడు హుండీ లెక్కింపు

గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీ నర్సింహ ఆలయ హుండీలను నేడు (శుక్రవారం) లెక్కించనున్నట్లు ఈఓ శేషగిరి, వంశ పారంపర్య ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు తెలిపారు. అర్చకులు, దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కింపు ఉంటుందని పేర్కొన్నారు.

పల్లె దవాఖానాలో తప్పని తిప్పలు

- నాసిరకం నిర్మాణంతో వెతలు
- చిరువర్షానికే గదుల్లోకి చేరుతున్న నీరు
- నీటి సౌకర్యమూ కల్పించని దుస్థితి

నర్సంపేట రూరల్ : పల్లె దవాఖానాలో వైద్యులు, సిబ్బందితోపాటు అనారోగ్యంతో వచ్చే వారికీ తిప్పలు తప్పడం లేదు. తాగునీటి సౌకర్యమూ లేని దుస్థితి నెలకొంది. నాసిరకంగా భవన నిర్మాణం చేపట్టడంతో ఏడాది గడవక ముందు చిరువర్షానికీ నీరు గదుల్లోకి చేరుతోంది.

నర్సంపేట మండలంలోని మాధన్నపేటకు గతంలో ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎం నుంచి రూ.16 లక్షలు మంజూరు చేసింది. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ నాణ్యతాప్రమాణాలను గాలికొదిలేశారు. తాగునీటి కోసం ఆస్పత్రిపైన ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌కు పైపులైన్ కూడా వేయలేదు. అయినా గతేడాది అక్టోబర్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులు దవాఖానాను అసంపూర్తిగా ఉన్న దశలోనే హడావుడిగా ప్రారంభించారు. ఇక నాటి నుంచి కాంట్రాక్టర్ తాగునీటి, ఇతర వసతుల కల్పనను పట్టించుకోలేదు. భవనాన్ని నిర్మించి ఇంకా ఏడాది కూడా గడవక ముందే కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆస్పత్రిలోని వైద్యుడి, ఇతర గదుల్లోకి వర్షపు నీరు చేరుతోంది. గోడలు తడిచి నిమ్ము వస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో పల్లె దవాఖానలో పని చేస్తున్న వైద్య సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. తాగునీటి కోసం రోగులే కాకుండా సిబ్బంది సైతం బయటకు వెళ్లక తప్పడం లేదు. ఇకనైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో నెలకొన్న అన్ని సమస్యలనూ శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించడంతోపాటు నాసిరకంగానే భవనాన్ని అసంపూర్తిగా అప్పగించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



ఆస్పత్రిలోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. పనులు పూర్తి కాక ముందే కాంట్రాక్టర్ భవనాన్ని అప్పగించారు. నీటి సౌకర్యం లేదు. పైన ట్యాంక్ ఏర్పాటు చేయకుండా వదిలేశారు. తాగునీటి, ఇతర ఏర్పాట్లు చేయించే దిశగా చొరవ తీసుకుంటా.

-డాక్టర్ ప్రకాశ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం



రైతులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

పర్వతగిరి : రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. మండలంలోని చౌటపల్లిలో ఇటీవల రుణమాఫీ అయిన రైతులకు పీఏసీఎస్ ద్వారా మంజూరైన రుణాల చెక్కులను చైర్మన్, కమిటీ సభ్యుల సమక్షంలో గురువారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని చెప్పారు. అనంతరం గ్రామంలోని సీతారామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తదనంతరం కల్లెడలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు అమ్మవారి విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు.

ప్రజలకు అత్యుత్తమ సేవలే లక్ష్యం



నర్సంపేట : సర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



సంగెం : సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

నర్సంపేట : ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ స్మార్ట్ కార్డులు అందించే దిశగా కార్యాచరణ చేపట్టిందని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. పట్టణంలోని 18వ డివిజన్‌లో డిజిటల్ స్మార్ట్ కార్డు పైలెట్ ప్రాజెక్టును గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ కార్డులాగా కాకుండా అన్నిటిని కలిపి ఒకే డిజిటల్ స్మార్ట్ కార్డు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రజలను చైతన్యవంతం చేసే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణవేణి, తహసీల్దార్ రాజ్‌కుమార్, కమిషనర్ జోనా, టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య, కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలని కృష్ణానగర్‌లో రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది చేపట్టిన డిజిటల్ కార్డుల సర్వేను తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ రవీందర్ పరిశీలించి మాట్లాడారు. రేషన్, ఆరోగ్యశ్రీ, హెల్త్ ప్రొఫైల్ కోసం ప్రత్యేక నంబర్‌తో కూడిన స్మార్ట్ కార్డును ప్రభుత్వం అందజేయనుందని తెలిపారు. సర్వే అనంతరం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ కొమురయ్య, పంచాయతీ కార్యదర్శి ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, దుగ్గొండి, గీసుకొండ, నల్లబెల్లి, చెన్నారావుపేట, వర్ధన్నపేట, పర్వతగిరి, ఖానాపురం, రాయపర్తి, తదితర మండలాల్లో ఊరూరా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వేడుకగా ప్రారంభం అయ్యాయి. గ్రామాల్లో భక్తులు దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. మొదటి రోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు కుటుంబాలతో సహా ఆలయాలకు చేరుకుని అమ్మవారిని భక్తి శ్రద్ధలతో పూజించారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



చెన్నారావుపేట : అక్కల్‌చెడలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



దుగ్గొండి : నాచినపల్లిలో పూజ చేస్తున్న భక్తులు



నల్లబెల్లిలో..



ఖానాపురంలో..

శాశ్వత ప్రాతిపదికన బ్రిడ్జిల నిర్మాణం



బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

- నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డి

నెక్కొండ : నర్సంపేట నియోజకవర్గ పరిధిలోని లో లెవల్ బ్రిడ్జిల స్థానంలో శాశ్వత ప్రాతిపదికన బ్రిడ్జిల నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిఆపరు. మండలంలోని వెంకటాపురం–తోపనపల్లి గ్రామాల నడుమ ఉన్న లో లెవల్ బ్రిడ్జి తాత్కాలిక పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. హై లెవల్ బ్రిడ్జిల ఏర్పాటుకు డిమాండ్ ఉందన్నారు. లో లెవల్ బ్రిడ్జిలతో ఎదురవుతున్న ఇబ్బందులు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని తెలిపారు. పాత కాలం నాటి లో లెవల్ బ్రిడ్జిల స్థానంలో శాశ్వత పనులు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్లు రావుల హరీశ్‌రెడ్డి, పాలాయి శ్రీనివాస్, నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, నర్సంపేట కోర్టు ఏజీపీ బండి శివకుమార్, నాయకులు లావుడ్యా తిరుమల్, కుసుమ చెన్నకేశవులు, మాదాటి శ్రీనివాస్, రావుల మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విరాళం



రాయపర్తి : మండలంలోని పలు గ్రామాల్లో దుర్గామాత విగ్రహాల ఏర్పాటుకు ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి పంపించిన విరాళం డబ్బును ఫౌండేషన్ ప్రతినిధి అందజేశారు. తిర్మాయపల్లిలో రూ.17 వేలు, కొండూరులో రూ.11 వేలు అందజేశారు. కార్యక్రమాల్లో ఫౌండేషన్ ప్రతినిధులు వల్లాల సుధాకర్, ఇల్లంద మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముద్రబోయిన వెంకన్న, మాజీ సర్పంచ్ కర్ర సరిత రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అనుమతులపై చర్యలు శూన్యం..!

సంగెం : మండలంలోని గుంటూరుపల్లి పంచాయతీ పరిధిలో అక్రమ అనుమతులపై చర్యలు శూన్యం అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన అనిత మొండ్రాయికి బదిలీ అయి ఏడాది గడచినా గ్రామ పంచాయతీ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఇవ్వకుండా, అక్రమ అనుమతులు ఇస్తోందంటూ చర్చ జోరందుకుంది. అనిత బదిలీ అయ్యాక పెద్దతండ పంచాయతీ కార్యదర్శిగా ఉన్న యాదగిరికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అనంతరం చౌటపల్లి కార్యదర్శిగా పని చేస్తున్న సరిత మార్చి 1న గుంటూరుపల్లి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. గతంలో గుంటూరుపల్లిలో పని చేసిన కాలంలో అనిత గ్రామంలో రెండు ఇళ్ల నిర్మాణానికి అక్రమంగా అనుమతులు జారీ చేశారు. ఆ ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా ఇంటి నంబర్ కేటాయించాలంటూ యజమానులు ప్రస్తుత కార్యదర్శి సరితపై ఒత్తిడి తీసుకొచ్చారు. టీఎస్ బీపాస్ సైట్ ప్రస్తుతం మున్సిపాల్టీ పరిధిలోకి వెళ్లిందని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కార్యదర్శి సూచించగా గుంటూరుపల్లి గ్రామ ఈ–పంచాయతీ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఇంకా తన వద్దే ఉంచుకున్న అనిత అక్రమంగా ఇంటి నంబర్లు కేటాయించింది. ఈ క్రమంలో ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి సరిత పాత కార్యదర్శి అనిత ఇంటి నంబర్లు కేటాయించిన విషయంతోపాటుగా యూజర్ ఐడీ, పాస్ వర్డ్ ఇవ్వకపోవడం, తదితర సమస్యలపై డీపీఓ, డీఎల్‌పీఓ, ఎంపీడీఓ, ఎంపీఓలకు లిఖితపూర్వకంగా సెప్టెంబర్ 9న ఫిర్యాదు చేసింది. అయినా అనితపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ రవీందర్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఫిర్యాదు చేసింది వాస్తవమే అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వెంకటేశ్వర్‌రావు సేవలు మరువలేనివి

నర్సంపేట రూరల్ : రైతులకు అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు అందించిన సేవలు మరువలేనివని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. నర్సంపేట మండలంలోని ముగ్దుంపురంలోని శ్రీరామ రైతు విత్తన కేంద్రంలో వెంకటేశ్వర్‌రావు, శశి రాజగోపాల్ వర్ధంతి కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వెంకటేశ్వర్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే శశి రాజగోపాల్ చిత్రపటానికీ నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వెంకటేశ్వర్‌రావు, శశి రాజగోపాల్‌ను పాదుపు సంఘాలు ఏర్పాటు చేసేందుకు పల్లెల్లో ప్రజలను చైతన్యవంతం చేశారని చెప్పారు. వెంకటేశ్వర్‌రావు న్యాయవాదిగానే కాకుండా రైతుగా చిన్నపాటి కమతాలను పెద్దవిగా చేశారని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచాక ప్రజాసంక్షేమానికి ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. 1995 మాక్స్ చట్టాన్ని తీసుకొచ్చిన ఘనత వెంకటేశ్వర్‌రావుకే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ అదనపు ఎస్పీ రాంనర్సింహారెడ్డి, అర్శనపల్లి ప్రభాకర్‌రావు, డైరెక్టర గోపు జైపాల్‌రెడ్డి, బోయిని పాపారావు, నూనె కుమారస్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు, నాయకులు ఓర్సు తిరుపతి, వేముల సాంబయ్య, బానోత్ లక్ష్మణ్‌నాయక్, బత్తిని రాజేందర్, లక్ష్మి, కుమారస్వామి, రాజు, యాదమ్మ, పాపరావు, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని పాత సొసైటీ భవనం వద్ద అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. వెంకటేశ్వర్‌రావు ఎమ్మెల్యేగా, న్యాయవాదిగా, సొసైటీ వ్యవస్థాపకుడుగా ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు జంగిలి బాబు, రాంబాబు, శంకర్, బషీర్, శ్రీను, మహేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, గోపి, తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో బెంబేలు



నల్లబెల్లి : మండలంలోని నారక్కపేటలో వరుసగా రెండు చోరీలు జరగడంతో జనం బెంబేలెత్తుతున్నారు. ఎస్సై ప్రశాంత్ బాబు కథనం ప్రకారం.. నారక్కపేటకు చెందిన కరీమ్ ఇంట్లోకి బుధవారం అర్ధరాత్రి దొంగలు చొరబడి సుమారు లక్ష రూపాయల విలువైన 3 ఆంప్లిఫైర్లు చోరీ చేశారు. అలాగే గ్రామానికి చెందిన పొగుల కుమారస్వామి గురువారం ఇంటికి తాళం వేసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా దొంగలు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.42 వేల 300 నగదు తస్కరించరు. కరీమ్, పొగుల కుమారస్వామి వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాలను ఎస్సై ప్రశాంత్ సందర్శించి విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్ చేరుకుని ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఓటరు జాబితాను సవరించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

వర్ధన్నపేట : మండలంలోని కాషగూడెంలో ఓటరు జాబితాను సవరించాలని కోరుతూ గ్రామస్తులు ఎంపీడీఓ వెంకటరమణకు గురువారం వినతిపత్రం అందించారు. తప్పులను సవరించే వరకు పంచాయతీ ఎన్నికలు నిర్వహించొద్దని వారు కోరారు. అనంతరం గ్రామస్తులు తప్పులు, సవరించాల్సిన అంశాలను విలేకరులకు వివరించారు. షేక్ హుసేన్ తల్లి షేక్ అమల్ చాలా కాలంగా ఐదో వార్డులో నివసిస్తుండగా ఆమెను రెండో వార్డులో చేర్చారని చెప్పారు. మొగల్ సెల్లార్ బీ ఐదో వార్డులో ఉండగా ఆమె మృతి చెంది ఏడాది గడుస్తున్నా ఏడో వార్డుకు మార్చారని తెలిపారు. మొగల్ కాలియా కుటుంబం ఏడో వార్డులో ఉండగా ఐదో వార్డుకు మార్చారని చెప్పారు. బీఆర్‌ఎస్ నాయకులు స్థానిక పంచాయతీ కార్యదర్శి కుమ్మక్కై వారికి అనుకూలమైన వార్డులోకి మార్చారని ఆరోపించారు. ఈ విషయమై ఎంపీడీఓను వివరణ కోరగా విచారణ చేస్తామన్నారు. సమస్యలను పంచాయతీ కార్యదర్శి తన దృష్టికి తీసుకురాలేదని చెప్పారు. సాధ్యమైతే ఉన్నతాధికారుల అనుమతితో ఓటరు జాబితా సవరణకు కృషి చేస్తామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పఠాన్ రాజక్, షేక్ హుసేన్, సయ్యద్ యాకూబ్, షేక్ మదార్, మొగల్ కరీం, సయ్యద్ కమల్, పఠాన్ రజాక్ తదితరులు ఉన్నారు.

పరామర్శ

సంగెం : మండలంలోని ఆశాలపల్లికి చెందిన బొల్లె బోయిన ఉపేంద్ర, కొమురయ్య, తీగరాజుపల్లికి చెందిన ఉప్పునూతుల శంకరాచారి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి..

సంగెం : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కోడూరి సదయ్యను అతడి తండ్రి వీరమల్లు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. అనంతరం బిట్ల రాజేశ్వర్ కుటుంబాన్ని పరామర్శించారు.

గోరుగుట్టతండాలో..

పర్వతగిరి : మండలంలోని సోమారం గోరుగుట్టతండాకు చెందిన భానోతు కమలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు గురువారం పరామర్శించారు. తొలుత మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సర్వాపురంలో..

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని సర్వాపురంలో వేమ కొమ్మాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మెపా వ్యవస్థాపకుడు పులి దేవేందర్ పరామర్శించారు. తొలుత కొమ్మాలు చిత్రపటానికి నివాళులర్పించారు.

ఆర్థికసాయం

సంగెం : ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు బిట్ల రాజేశ్వర్ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె లింగమూర్తి, సత్యం గురువారం రూ.60 వేల సాయం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

నివాళి

రాయపర్తి : మండలంలోని కొండూరుకు చెందిన మాజీ సర్పంచ్ గుగులోతు సోమ్లానాయక్ కూతురు శివాని గురువారం మృతి చెందగా ఆమె మృతదేహానికి మాజీ రాష్ట్ర మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రబెల్లి దయాకర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సంతాపం తెలిపారు.

కేసు నమోదు

చెన్నారావుపేట : బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు. ఆయన విలేకరులకు గురువారం వివరాలు వెల్లడించారు. మండలానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడని తెలిపారు. ప్రేమ పేరుతో మోసం చేశాడంటూ బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రేపు జాబ్‌మేళా

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారంలోని ఎస్‌ఎస్ డిగ్రీ కళాశాలలో రేపు (శనివారం) జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు వైస్ ప్రిన్సిపాల్ కొక్కొండ శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ మారుతి ఇండస్ట్రీస్, శ్రీరాం ఇన్సూరెన్స్ కంపెనీల ఆధ్వర్యంలో ఫీల్డ్ ఆఫీసర్ పోస్టులకు మండలాల వారీగా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 9550575429లో సంప్రదించాలని పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చెన్నారావుపేట : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. చింతకాయల చంద్రమౌళి (55) వ్యవసాయ భూమి వద్ద ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు ఆయన్ను నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

గౌరవ వేతనం అందించాలి

నర్సంపేట : రేషన్ డీలర్లకు రూ.5వేల గౌరవ వేతనం అందించాలని, రూ.300కు కమీషన్ పెంచాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు దారావత్ మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, ఖానాపురం మండల అధ్యక్షుడు రవీందర్, మాజీ అధ్యక్షుడు రాంనారాయణ, మోహన్‌రెడ్డి, సాహెబ్ హుస్సేన్, చంద్రాచారి, డీలర్లు పాల్గొన్నారు.

విచారణ చేపట్టండి

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముత్తోజిపేట గ్రామ పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కాంపెల్లి విజేందర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వేముల నవీన్ ప్రభుత్వాన్ని ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజేందర్‌రెడ్డి, నవీన్ మాట్లాడారు. తీర్మానం లేకుండా సర్పంచ్, ఉపసర్పంచ్ కలిసి రూ.3 లక్షలు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.